క్లుప్తంగా

యూరియా స్టాక్ పరిశీలన



నవాబుపేట: తరచూ యూరియా కొరత రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఆయా దుకాణాలకు కేటాయించిన యూరియా స్టాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విక్రమ్‌తోపాటు మండల అధికారులు నవాబుపేటలో యూరియా స్టాక్ పాయింట్ల చెంత తనిఖీలు నిర్వహించారు. కాగా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని రైతులకు కావాల్సిన యూరియా అందించాలని సూచించారు.

25న పెద్దవార్వాల్‌లో టీబీ క్యాంపు

గండీడ్: మండలంలోని పెద్దవార్వాల్‌లో ఈ నెల 25న టీబీక్యాంపు నిర్వహించనున్నట్లు గండీడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. సబ్ సెంటర్ వద్ద ఉదయం 8గంటలకు క్యాంప్ ప్రారంభమవుతుందని, రెండు వారాలకు మించి దగ్గు ఉన్నవాళ్లు,జ్వరంతోపాటు రాత్రిపూట చెమటలు పట్టడం, తెమడతోపాటు రక్తం పడేవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు.అలాగే ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారు, మెడలో వాపు అలసట, నిద్ర రాకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వైద్యుల సూచనమేరకు చికిత్స చేయించుకోవాలని తెలిపారు.

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే వేడుకలకు నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పార్టీ కార్యకర్తలు అందుబాటులో ఉండి సేవలు చేయాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లి వద్ద ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న అటెండర్, కుక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం సాయంత్రంలోగా అందజేయాలని సూచించారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి

మహమ్మదాబాద్: సీపీఎస్‌ను రద్దు చేయాలని సెప్టెంబరు 1న నిర్వహించే పీఆర్‌టీయూ టీఎస్ ధర్నా పోస్టర్‌ను మంగళవారం మహమ్మదాబాద్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో మండలాధ్యక్షుడు బీరం భీంరెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సీనియర్ బాధ్యుడు రవీందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం నీలకంఠప్ప, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు చౌడమ్మ బోనాలు

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలోని చౌడమ్మ గుట్టలో వెలిసిన ముత్యాలమ్మ, పగుడాలమ్మ, చౌడమ్మ బోనాలను బుధవారం నిర్వహించనున్నారు. నిర్మించని గుడిలో ఉన్న ముగ్గురమ్మలు నవాబుపేట, యన్మన్‌గండ్లతోపాటు మరో 4 గ్రామాల ప్రజలకు ఇంటి దేవతలుగా ఉన్నారు. శ్రావణమాసం చివరి వారంలో అన్ని గ్రామాలు సామూహికంగా బోనాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో బోనాలకు గుట్ట సిద్ధమైంది.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లిలో అమ్మాయిని అదే గ్రామానికి చెందిన యువకుడు ఓర్సు మనోహర్ కొంత కాలంగా వేధింపులకు గురిచేసి వెంటపడుతున్నాడని మైనర్ తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనోహర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

మండపాల వద్ద డీజేలు పెట్టొద్దు

మహబూబ్‌నగర్ క్రైం: గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు డీజేలను పెట్టొద్దని వన్‌టౌన్ సీఐ అప్పయ్య అన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో మంగళవారం అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లోని ప్రత్యేక పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండపాలను నాణ్యమైన పాలిథీన్ కవర్‌తో నిర్మించాలన్నారు. స్పీకర్లు ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఉపయోగించాలన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, హైటెన్షన్ వైర్లు వంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య పాల్గొన్నారు.

కుంగిన మల్కచెరువు కట్ట

- ప్రమాదంలో కొంరెడ్డిపల్లి కొత్త చెరువు
- ఇసుక బస్తాలు పేర్పించిన అధికారులు



మహమ్మదాబాద్ మల్కచెరువు కట్టకు సపోర్టుగా ఇసుక బస్తాలు వేసిన అధికారులు


గండీడ్/మహమ్మదాబాద్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా చెరువులు, కుంటలు అలుగు పారుతూ.. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలుచోట్ల సమస్యలు చోటుచేసుకున్నాయి. మహమ్మదాబాద్ మండలంలోని మల్కచెరువు వారం కిందటే నిండి అలుగు పారుతున్నది. రోజూ ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో కట్ట కుంగిపోయింది. పెద్ద తూము వద్ద కట్ట కిందికి కుంగిపోయింది. మంగళవారం స్థానికులసమాచారం మేరకు చెవేళ్ల ఇరిగేషన్ డీఈ వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పరిశీలించారు. కట్టకు ప్రమాదం పొంచి ఉండడంతో దాదాపు 150 బస్తాల్లో ఇసుక నింపి కట్టకు సపోర్టుగా వేశారు. దాదాపు రెండుమూడు గంటలపాటు శ్రమించి బస్తాలు పేర్పించారు. దీంతో కట్టకు ప్రమాదం తప్పింది.

ప్రమాదంలో కొత్త చెరువు

కొంరెడ్డిపల్లి కొత్త చెరువు ప్రమాదంలో పడింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మట్టి పడడంతో అలుగుకు అడ్డంగా పడడంతో చెరువు నిండి నీరు బయటికి వెళ్లకుండా ఉండడంతో ప్రమాదకరంగా మారింది. మరింత నీరు వచ్చి చేరితే కట్టకు ప్రమాదమని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇరిగేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పరిశీలించారు. అలుగుకు అడ్డంగా ఉన్న మట్టిని జేసీబీతో తొలగింపజేశారు. గ్రామాల్లో చెరువులు, కుంటలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నిండుకుండలా లోకిరేవు పెద్దచెరువు

నవాబుపేట: మండంలో చాలా గ్రామాల్లో అలుగులు పారిన సంతోషంతో జనం సంబురపడటం కనిపించింది. వరుస వర్షాలతో చెరువులు నిండుకుండలామారి అలుగులు పారుతున్నాయి. ప్రధానంగా మండలానికే అతి పెద్ద చెరువుగా ఉన్న లోకిరేవు పెద్ద చెరువు మంగళవారం నిండి అలుగు పారింది. దీంతో అక్కడ పెద్ద జలపాతాన్ని తలపించే దృశ్యాలు ఏర్పడడంతో చెరువు చెంత జాతరల జనం వస్తున్నారు. కాగా మండలంలోని 12 పెద్ద చెరువులకు 8చెరువులు నిండాయి.



ఫత్తేపూర్‌లో మాదిగవాని కుంటకు గండి



మాదిగవాని కుంటకు గండి పడడంతో నీట మునిగిన వరిపంట

మహబుబ్‌నగర్ (వ్యవసాయం): మండలంలోని ఫత్తేపూర్‌లో వరుస వర్షాలతో కుంటకు గండి పడింది. దీంతో దాని పరిధిలోని ఆయకట్టు రైతుల పొలాలన్నీ నీట మునిగాయి. మంగళవారం ఫత్తేపూర్‌కు చెందిన మాదిగవాని కుంటకు పెద్ద గండి పడింది. దీంతో కుంటలో ఉన్న నీరంతా పంటపొలాలకు చేరింది. కుంట పరిస్థితి బాగాలేదని గ్రామస్తులు అధికారులకు వివరిస్తున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిరచడంతోనే కుంటకు గండి పడిందని రైతులు వాపోయారు. కాగా గండితో పల్లె కృష్ణయ్య, పంతుల రాజు, కర్నాకర్ రైతుల వరిపంటలు నీట మునిగాయి. తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

పీజీ నీట్‌లో జడ్చర్లవాసికి ర్యాంకు



జడ్చర్ల టౌన్: పీజీ నీట్ ఫలితాల్లో జడ్చర్ల వాసి కేతావత్ శ్రీతేజ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 1672వ ర్యాంకు సాధించాడు. రాష్ట్రస్థాయిలో గిరిజన విభాగంలో మొదటి ర్యాంకు, ఓపెన్‌కేటగిరీలో మొదటి పది స్థానాల్లో ర్యాంకు ఉన్నట్లు తెలిపారు. కేతావత్ తేజ ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. అహర్నిశలు ప్రణాళికాబద్ధంగా చదవడంతోనే ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో మెరుగైన ర్యాంకు సాధించినట్లు తేజ 'సాక్షి'కి తెలియజేశారు.

టీఎల్‌ఎంలతో బోధించాలి

భూత్పూర్: విద్యార్థులకు టీఎల్‌ఎంల ద్వారా బోధించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం భూత్పూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అభ్యసన మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళా ఆకట్టుకుందని, పెద్దమొత్తంలో బోధనలో అవలంబించాల్సిన నూతన పద్ధతులు, ప్రదర్శన అందరినీ ఆకట్టుకుందని డీఈఓ, ఉపాధ్యాయులను ప్రశంసించారు. 548 రకాల టీఎల్‌ఎంలను ప్రదర్శించగా విద్యార్థులను ఆకర్షించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఎంఈఓ ఉషారాణి, ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఏఎంఓ శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రతగా ఉండాలి

రాజాపూర్: విద్యుత్‌తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏఈ వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కురుస్తున్న వర్షాలకు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని వినియోగదారులకు సూచించారు. తడిసిన స్తంభాలు, కరెంట్ వైర్లు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదని పేర్కొన్నారు.

న్యూమోతీనగర్‌లో ఆర్‌యూబీని విస్తరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో న్యూ మోతీనగర్‌లోని ఆర్‌యూబీ నుంచి కొన్నిరోజులుగా వరద ఏరులై పారుతోంది. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈమార్గం ద్వారానే దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి ప్రజలు నగరానికి రాకపోకలు కొనసాగిస్తారు. పక్కనే ఉన్న కాల్వ ద్వారా మురుగు సాఫీగా ముందుకెళ్లేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, ఇక్కడి ఆర్‌యూబీని విస్తరించాలని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, స్థానికులు యాదయ్య, నర్సింహులుచారి, వెంకటేశ్, శ్రీనివాసులు సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఎస్పీ కార్యాలయంలో కేక్‌కట్‌చేస్తున్న ఎస్పీ జానకి



ఫొటో జర్నలిస్టులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



దేవరకద్రలో ఎమ్మెల్యే సతీమణి కవితను సన్మానిస్తున్న ఫొటోగ్రాఫర్లు



చిన్నచింతకుంటలో కేక్ కట్‌చేస్తున్న తహసీల్దార్ ఎల్లయ్య

స్టేషన్ మహబూబ్‌నగర్/దేవరకద్ర/చిన్న చింతకుంట: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఫొట్రోఫీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఫొటో జర్నలిస్టులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో కేక్‌కట్ ఫొటోజర్నలిస్టులకు ఎస్పీ జానకి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు శివరాజ్ ఫొటో జర్నలిస్టులను సన్మానించారు. ప్రెస్ క్లబ్‌లో కేక్‌కట్ చేశారు. దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో మంగళవారం ఫొటోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా మెడికల్, రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీమణి కవిత హాజరు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ ఎల్లయ్య హాజరై ఫొటోగ్రఫి పితామహుడు లూయిస్ డాగ్‌రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

బోనమెత్తి.. భక్తితో పరవశించి



జడ్చర్లలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, గ్రామస్తులు



రాయపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



మిడ్జిల్ ఈదమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



పోచమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మిడ్జిల్/జడ్చర్ల టౌన్: మండల కేంద్రంతోపాటు వాడ్యాల్, ము న్ననూర్, వల్లభ్‌రావుపల్లి, వస్పుల, అయ్యవారిపల్లి, బోయిన్‌పల్లి, కొ త్తూర్, మాల్లాపూర్‌లో గ్రామదేవతలైన పోచమ్మ, ఈదమ్మ, మైసమ్మ బోనాలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని బోనాల వేడుకలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు. రాజాపూర్‌తోపాటు రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, నందిగామ, కుచ్చర్‌కల్, ఖానాపూర్‌లో మంగళవారం పోచమ్మ, మైసమ్మ బోనాలను నిర్వహించుకున్నారు.

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాతబజార్, జడ్చర్ల పోచమ్మ ఆలయాల్లో మంగళవారం బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



మిడ్జిల్ కేజీబీవీ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. బాలికల విద్యాలయంలో కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యాసంవత్సరం ఇంటర్ ఏర్పాటు కావడంతో గదుల కొరతతోపాటు వంటకు ఇబ్బంది అవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలపై జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువైందని ఇన్‌చార్జి ఎస్‌ఓ శిరీష ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ వాటర్ తరలించుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ ఆనంద్, వైద్యాధికారి శివకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లల్లో ఉండకండి



డీఎన్‌టీ పగిడ్యాల్ పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రావు

గండీడ్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పంచాంగల్ తండాలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎన్‌టీ పగిడ్యాల్ పాఠశాలను తనిఖీ చేసి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రమాదం పొంచి ఉందన్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకొని కూలేదశలో ఉన్న ఇళ్లల్లో ఉండకూడదని సూచించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు నిండి ప్రమాదస్థాయిలో ప్రవహించే వాగులు దాటడానికి ఏమాత్రం సాహసించరాదని పేర్కొన్నారు. పంచాంగల్ తండాలో ఓ శిథిలావస్థ ఇంటిలో ఉన్న మహిళను పక్కనే ఉన్న బంధువుల ఇంటిలోకి పంపించాడు. ఆయనవెంట మాజీ సర్పంచ్ రాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేయాలి

భూత్పూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పేర్కొన్నారు. మంగళవారం అడ్డాకుల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. గ్రామంలో 27 ఇళ్లు బేస్‌మెంట్ వరకు చేపట్టగా లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ రాకపోగా స్వయంగా అదనపు కలెక్టర్ ఫొటోను క్యాప్చర్ చేసి అప్‌లోడ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామీణ యోజనపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో మరమ్మతులు ఉంటే చేపట్టాలని వైద్యాధికారి హుస్సేన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓ సద్గుణ, కార్యదర్శి సరస్వతి తదితరులు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం



స్టేషన్ మహబూబ్‌నగర్: నూతన డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఆయనకు స్టేషన్ మేనేజర్‌తోపాటు రైల్వే సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. పూలబొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు. స్టేషన్‌లో చేపడుతున్న ఏబీఎస్ఎస్ పనులు, స్టేషన్ పరిసరాలు, కమ్యూనిటీ హాల్‌తోపాటు సిగ్నలింగ్ గది, ఇతర విభాగాలను డీఆర్‌ఎం పరిశీలించారు. ఆయన వెంట పలు విభాగాల అధికారులు తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ల ప్రదానం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రానికి చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు మండికాడి శివలీల ఓయూలో సోషియాలజీ విభాగంలో సోషియో సైకలాజికల్ స్టడీ ఆఫ్ పీజీ స్టూడెంట్స్ ఎట్ ఉస్మానియా యూనివర్సిటీ అంశంలో పరిశోధ చేసినందుకు ఓయూలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్‌నారాయణ, ఓయూ వీసీ శ్రీకుమార్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నది.

డాక్టరేట్ రావడంపై హర్షం

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లికి చెందిన జానకిరామ్ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు. తెలంగాణ రైతుల ఆత్మహత్యలు, సామాజిక ఆర్థిక విశ్లేషనపై పరిశోధన చేశాడు. డాక్టరేట్ పొందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని టీటీగుట్ట పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాకేశ్‌కుమార్ చర్కాకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధాయులు రాఘు రాంరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఎంసీహెచ్, రామయ్యబౌలి, పీపీయూనిట్, పాతపాలమూరు, మోతీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ల ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఎక్కడికక్కడ వైద్యాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నగర కన్వీనర్ రాజ్‌కుమార్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులను ఖండించాలి



పాలమూరు: ఇటీవల వైద్యులపై దాడులు తీవ్రమవుతున్నాయని, వైద్యులపై దాడులు చేయడం సరికాదని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో ప్రోగ్రెసివ్ థింకర్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మేధావుల రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నేత ఎన్.పీ వెంకటేశ్, బీజేపీ మాజీ అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, న్యాయవాది బెక్కెం జనార్దన్ హాజరై మాట్లాడారు. జిల్లాలో వైద్యులపై దాడులకు పాల్పడుతున్న ఘటనలను తీవ్రగా పరిగణించి కారకులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు రామ్మోహన్, విజయ్‌కాంత్, రఘు, సుప్రీత్‌రెడ్డి, చైతన్య, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని 10 గొర్రెలు మృతి

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లి శివారులో మంగళవారం తెల్లవారుజామున కేశ శ్రీనువాసులకు చెందిన దాదాపు 150 గొర్లను వేరేచోటుకు తరలిస్తుండగా బోయిన్‌పల్లి సమీపంలో 167 జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో 10 గొర్రెలు మృతిచెందగా.. 20గొర్లు గాయపడినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యాభివృద్ధికి కృషి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలో ఇంజనీరింగ్ విద్య అభివృద్ధి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారని బీసీ జేఏసీ జిల్లా నాయకుడు మైత్రి యాదయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీద, బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నారని, నిరుపేద కుటుంబంలో జన్మించి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించలేని పేదవిద్యార్థుల కోసం తన సొంత నిధులు వెచ్చిస్తున్నారని, దీంతో 100మందికి ఇంజనీరింగ్ సీట్లు ఉచితంగా అందించినట్లు తెలిపారు. పాలమూర్‌ను విద్యాహబ్‌గా మార్చేందుకు తనవంతు కృషి చేస్తున్నందుకు పాలమూరు ప్రజల తరఫున దన్యావాదాలు తెలిపారు.

సొంతగూటికి మానసిక దివ్యాంగురాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ సత్యేశ్వర ఆశ్రమంలో ఆశ్రయమిచ్చిన ఓ వృద్ధురాలిని మంగళవారం సొంతగూటికి చేర్చారు. శంకర్ భాయి అనే వృద్ధురాలు మహబూబ్‌నగర్‌లో రోడ్డుపై మతిస్థిమితం కోల్పోయి తిరుగుతూ ప్లాట్ ఫాంపై నిద్రిస్తుండేది. మార్చిలో సఖి కేంద్రం నిర్వాహకులు సత్యేశ్వర ఆశ్రమానికి పంపించారు. అప్పటినుంచి ఆశ్రమంలో సపర్యలు, యోగ, ధ్యానం, చికిత్స అందిస్తూ వచ్చారు. క్రమేపీ మానసిక స్థితినుంచి కోలుకుంటూ వచ్చి తన కూతురు స్రవంతి, తమది కొల్లాపూర్ వద్ద ఉన్న కొండ్రావుపల్లిగా ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, రామకృష్ణకు తెలియజేసింది. స్పందించిన వారు సఖి కౌన్సిలర్ షహీన్, జడ్చర్ల పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులను సంప్రదించి మంగళవారం వారి సమ క్షంలోనే వృద్ధురాలిని కూతురు స్రవంతికి అప్పగించారు. తన తల్లికి ఆశ్రయం కల్పించినందుకు సత్యే శ్వర ఆశ్రమ నిర్వాహకులకు స్రవంతి కృతజ్ఞతలు తెలియజేసింది.

వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి

జడ్చర్ల టౌన్: వర్షాలపై జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శంకరయ్యపల్లి తండాలో కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. యజమాని హనుమంతును పరామర్శించి ఇంటిని ఖాళీ చేయించారు. తండా అంగన్‌వాడీ భవనం, పాతస్కూల్ భవనం శిథిలావస్థలో ఉండడాన్ని పరిశీలించారు. ఆయనవెంట వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహాన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపాల్‌నాయక్, కిషన్, కృష్ణారావు, జగన్ ఉన్నారు.